క్లుప్తంగా

పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

తలకొండపల్లి: మండల పరిధిలోని గడ్డమీది తండా గ్రామ పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఎంపీడీఓ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యదర్శి రాణి విధులకు సరిగ్గా హాజరు కావడం లేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. భారీ వర్షాలకు తండా వాసులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తండాకు కార్యదర్శి రాకుంటే తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని వాపోయారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు రమేశ్‌నాయక్, శ్రీరామ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నవతరం గణేశ్ ఉత్సవ కమిటీ ఎంపిక



నవతరం యూత్ గణేశ్ ఉత్సవ కమిటీ

కడ్తాల్: మండల పరిధిలోని గానుగుమార్ల తండా గ్రామ పంచాయతీలో నవతరం యూత్ అసోసియేషన్ సింగిల్‌విండో డైరెక్టర్ సేవ్యానాయక్ ఆధ్వర్యంలో గణేశ్ ఉత్సవ కమిటీని బుధవారం ఏర్పాటు చేశారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా రాజునాయక్, గౌరవ అధ్యక్షుడిగా మూనావత్ రాజునాయక్, ఉపాధ్యక్షుడిగా హరినాయక్, ప్రధాన కార్యదర్శిగా వినోద్‌నాయక్, కార్యదర్శిగా మహేశ్‌నాయక్, కోశాధికారిగా గణేశ్, సభ్యులుగా చిన్న, జగన్, మహేశ్, రాకేశ్, చిన్న, సందీప్, సాయికుమార్ నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో శంకర్‌నాయక్, భీమన్, శ్రీను, మోత్యానాయక్, సక్రు, పత్యా, జగన్, గోపీ, దేవ్‌సింగ్, చందర్ పాల్గొన్నారు.

భాగ్యనగర్–మలక్‌పేట్ ఇన్‌చార్జిగా భగీరథ్



కడ్తాల్: బీజేవైఎం భాగ్యనగర్–మలక్‌పేట్ ఇన్‌చార్జిగా మండల కేంద్రానికి చెందిన భగీరథ్ నియమితులయ్యారు. రాష్ట్ర అధికార ప్రతినిధిగా కొనసాగుతున్న ఆయనను బుధవారం రాష్ట్ర అధ్యక్షుడు చేవెళ్ల మహేందర్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడారు. ఏబీవీపీ కార్యకర్తగా, అనేక విద్యార్థి ఉద్యమాలలో కీలక భూమిక పోషించాడన్నారు. అనతి కాలంలోనే ఏబీవీపీ స్టేట్ కో కన్వీనర్‌గా, బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఎదిగాడన్నారు. పార్టీ పట్ల విధేయత, కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించడం, పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పని చేయడాన్ని గమనించిన అధిష్ఠానం భగీరథ్‌కు కీలక బాధ్యతలు అప్పజెప్పిందన్నారు. అనంతరం భగీరథ్ మాట్లాడారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని ఆయన తెలిపారు. తనను ఇన్‌చార్జిగా నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వినాయక చవితిని ప్రశాంతంగా నిర్వహించాలి

ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు

యాచారం: వినాయక చవితి పండుగను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు సూచించారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్లో బుధవారం నిర్వాహకులతో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వినాయక మండపాలు ఏర్పాటు చేసే వారు ముందస్తు అనుమతులు తీసుకోవాలన్నారు. విద్యుత్ దుర్వినియోగం చేయొద్దని పేర్కొన్నారు. మండపాల వద్ద భక్తి పాటలనే పాడించాలని, డీజేలు ఏర్పాటు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేకాధికారి పద్మజా రమణి, యాచారం సీఐ శంకర్‌కుమార్, ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, వివిధ గ్రామాలకు చెందిన మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

నేత్రదానంపై అపోహలు వీడాలి

ఆమనగల్లు: నేత్రదానంపై అపోహలను వీడాలని నేషనల్ ప్రోగ్రాం కంట్రోల్ ఆఫ్ బ్లైండ్‌నెస్ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మోతీలాల్‌నాయక్ సూచించారు. ప్రతి ఒక్కరూ మరణానంతరం నేత్రదానం చేయాలని ఆయన కోరారు. పట్టణంలో బుధవారం ఆమనగల్లు లయన్స్‌క్లబ్, అంధత్వ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు పురస్కరించుకుని అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో మోతీలాల్‌నాయక్ మాట్లాడుతూ ఒక్కరి నేత్రదానంతో ఇద్దరికి చూపు ప్రసాదించవచ్చని చెప్పారు. అనంతరం నేత్రదానం చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో వసుల లక్ష్మారెడ్డి, కంటి వైద్యులు ఎం చంద్రశేఖర్, ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి డాక్టర్ పరిక్షిత్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

జ్వరం.. జరభద్రం..!

- గ్రామాల్లో పెరుగుతున్న బాధితుల సంఖ్య
- జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్న వైద్య సిబ్బంది



ఆరుట్లలో రోగి ఆరోగ్య సమస్య తెలుసుకుంటున్న డాక్టర్ దీప్తి (ఫైల్)

మంచాల: గ్రామాల్లో వర్షాలతో విషజ్వరాలు ప్రబలే అవకాశం లేకపోలేదు. ఇప్పటికే ఆర్ఎంపీ, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల వద్దకు రోగులు పెద్ద ఎత్తున్న వైద్యం కోసం వెళ్తున్నారు. మంచాల మండలంలో మంచాల, ఆరుట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. సాధరణ రోజుల్లో కంటే వర్షాలతోనే జ్వరం, ఒళ్లు నొప్పులు వంటి సమస్యలతో ఎక్కువగా వస్తున్నారు. మంచాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రోజుకు 70నుంచి 80 మంది రోగులు వైద్యం కోసం వస్తున్నారు. ఆరుట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సాధారణ రోజుల్లో కంటే వర్షాల అనంతరం 60 నుంచి 100కు రోగుల సంఖ్య పెరిగింది. జిల్లా అధికార యంత్రాంగం సూచన మేరకు గ్రామాల్లో జ్వరాల బారిన పడకుండా పలు జాగ్రత్తలు సూచిస్తున్నారు. జ్వర పరీక్షలు కూడా నిర్వహిస్తున్నారు. ఆరుట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో ఇప్పటి వరకు 165 కేసులు నమోదయ్యాయి. రెండు, మూడు రోజుల్లో రోగుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని వైద్య బృందం పేర్కొంటుంది.

వసతి గృహాల్లో క్యాంపులు

మండలంలోని వసతి గృహాలను అధికారులు సందర్శించి విద్యార్థుల ఆరోగ్య సమస్యలను తెలుసుకుంటున్నారు. మంచాల బీసీ బాలికల వసతి గృహం, రంగాపూర్ ఎస్టీ బాలికల వసతి గృహం, ఆరుట్లలోని ఎస్సీ బాలుర వసతి గృహం, ఆదర్శ పాఠశాల వసతి గృహాలను సందర్శించారు. విద్యార్థులను కలిసి ఆరోగ్య విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జ్వరాల బారిన పడిన వారికి మందులు కూడా పంపిణీ చేశారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి



గ్రామాల్లో వర్షాల కారణంగా అపరిశుభ్రత నెలకొని ఈగలు, దోమలు విపరీతంగా పెరిగిపోయాయి. దోమల నివారణకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి. దోమల నివారణకు ఫాగింగ్ వంటివి చేయాలి.

–నూతనగంటి శేఖర్, ఆరుట్ల

అవసరమైతే క్యాంపులు నిర్వహిస్తాం



గ్రామాల్లో వర్షాల కారణంగా జ్వరలు, ఒళ్లు నొప్పులే గాకుండా టైఫాయిడ్, డెంగ్యూ, మలేరియా వంటి జ్వరాలు ప్రబలే అవకాశం ఉంది. ప్రజలు చాలా జాగ్రత్తగా ఉండాలి. అవసరమైతే గ్రామాల్లో వైద్య క్యాంపులు కూడా నిర్వహిస్తాం.

– డాక్టర్ దీప్తి, ఆరుట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

పేదల సంక్షేమమే ధ్యేయం

ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



ఇబ్రహీంపట్నం: చెక్కు పంపిణీ చేస్తున్న చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు

ఇబ్రహీంపట్నం: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం మండలాలకు సంబంధించిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు శాస్త్రా గార్డెన్‌లో బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు కృషిచేస్తున్నట్లు చెప్పారు. రైతులందరికీ రుణమాఫీ చేస్తామన్నారు. ఈ ప్రక్రియ కొనసాగుతుందని రైతులు ఆందోళనకు గురికావద్దన్నారు. సాంకేతిక కారణలతో కొంతమంది రైతులకు మాఫీ కాలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం, ఆదిభట్ల మున్సిపల్ చైర్మన్లు కప్పరి స్రవంతి, మర్రి నిరంజన్‌రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ బి.మంగ, కౌన్సిలర్లు, యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం మండలాల ఎంపీడీఓలు, తహసీల్దార్లు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యేకు ఘన స్వాగతం..

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నంలో షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్‌కుమార్‌రెడ్డిలకు కాంగ్రెస్ నాయకులు బుధవారం ఘనస్వాగతం పలికారు. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని బొంగ్లూర్ ఔటర్‌రింగ్‌రోడ్డు వద్ద ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డిలకు పీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మంకాల కరుణాకర్‌లు శాలువ కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో భారీ ఎత్తున కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతే లక్ష్యం

ఎంపీడీవో కుసుమమాధురి



ఆమనగల్లు: శంకరకొండ తండాలో పల్లెప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో కుసుమమాధురి

ఆమనగల్లు: పరిసరాల పరిశుభ్రతే ధ్యేయమని ఆమనగల్లు ఎంపీడీవో కుసుమమాధురి సూచించారు. మండల పరిధిలోని మేడిగడ్డ తండా, శంకరకొండ తండాలలో బుధవారం ఎంపీడీవో పర్యటించారు. ఆయా తండాల్లోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. ఆయా తండాల్లో తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయించారు. పల్లె ప్రకృతి వనాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కుసుమమాధురి మాట్లాడుతూ గ్రామాలలో పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీఓ మాధవరెడ్డి, టీఏ జయమ్మ, గ్రామ కార్యదర్శి విజయ, ఫీల్డ్ అసిస్టెంట్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

హయత్‌నగర్‌లో..

హయత్‌నగర్: పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని, ప్రతి విద్యార్థి తమ వంతుగా మొక్కలు నాటాలని పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ వైస్ చైర్‌పర్సన్ చామ సంపూర్ణారెడ్డి పేర్కొన్నారు. సమీపంలోని పల్లవి ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు నిర్వహించిన వన్ స్టూడెంట్-వన్ ప్లాంట్ కార్యక్రమం నిర్వహించి తట్టిఅన్నారం ప్రభుత్వ పాఠశాలలో మొక్కలు నాటారు. విద్యార్థులకు రెండు కంప్యూటర్లు, పెన్నులు, పెన్సిల్లు, పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా సంపూర్ణారెడ్డి మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు నాణ్యమైన గాలి, నీరు, ఆహారం అందించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆమె సూచించారు. స్థానిక కౌన్సిలర్ దేవిడి గీతా వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రాజు, పాఠశాల హెచ్ఎం కొండల్‌రావు, కళాశాల ప్రతినిధులు సైదులు, శ్రీనివాస్, ప్రకాశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకుంటేనే ఆరోగ్యం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న న్యూట్రిషన్ బృందం

మాడ్గుల: ప్రతిరోజు పోషకవిలువలతో కూడిన ఆహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉండొచ్చని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ హైదరాబాద్ బృందం పేర్కొన్నారు. పోషణ్ మాస్ జాతీయ పోషకాహార మాసోత్సవాలు సందర్భంగా కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ఆధ్వర్యంలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ హైదరాబాద్ బృందం బుధవారం ఇర్విన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికల శారీరక మానసిక ఎదుగుదలకు పోషకాల ప్రాధాన్యత, రోజువారిగా తీసుకోవాల్సిన ఆహార పదార్థాలు,

కిశోర బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. పిల్లలు, గర్భిణులు, బాలింతలు, యువతుల ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి చేపడుతున్న ఒక గొప్ప కార్యక్రమమన్నారు. ఈ కార్యక్రమంలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ బృందం సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, భవ్యశ్రీ, నాగజ్యోతి, శిరీష, శశి, ప్రధానోపాధ్యాయులు పర్వతాలు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణమాఫీ

ఇబ్రహీంపట్నం డివిజన్ ఏడీఏ సుజాత

యాచారం: రైతులు ఆందోళన చెందొద్దని, అర్హులందరికీ రుణమాఫీ వర్తింపచేస్తామని ఇబ్రహీంపట్నం ఏడీఏ సుజాత పేర్కొన్నారు. మాల్ కేంద్రంలోని రైతు వేదికను బుధవారం ఆమె సందర్శించారు. రుణమాఫీ కాని రైతుల నుంచి వ్యవసాయాధికారులు ఏఏ పత్రాలను తీసుకుంటున్నారు? వివరాలు ఎలా నమోదు చేస్తున్నారు? వంటి విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ఆందోళన చెందొద్దని కొన్ని కారణాలు, సరైన వివరాలు లేకపోవడంతో కొందరికి రుణమాఫీ కాలేదన్నారు. మాఫీ కానిరైతుల కోసమే మళ్లీ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. ఆధార్, రేషన్‌కార్డు, పట్టాదారు, పాసుపుస్తకంలో పేర్లు తప్పులు ఉండడంతో చాల మందికి రుణమాఫీ వర్తించలేదన్నారు. మాఫీ కానీ రైతులను గుర్తించి కుటుంబ నిర్ధారణ, ఇంటింటి సర్వే చేసి ఫొటో సేకరిస్తున్నట్లు చెప్పారు. రైతులు పూర్తి వివరాలు అందజేసి వ్యవసాయాధికారులకు సహకరించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో యాచారం మండల వ్యవసాయాధికారి రవినాథ్ తదితరులు పాల్గొన్నారు.



యాచారం: దరఖాస్తుల నమోదును పరిశీలిస్తున్న ఏడీఏ సుజాత

రుణమాఫీ ఆందోళన వద్దు

అందరికీ వర్తింపచేస్తాం : వ్యవసాయాధికారి శ్రీనివాస్‌గౌడ్

ఆమనగల్లు: రుణమాఫీ వర్తించని రైతులు ఆందోళన చెందొద్దని మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్‌గౌడ్ సూచించారు. పోలెపల్లి, కొత్తకుంట తండాలో రుణమాఫీ కానీ రైతుల కుటుంబ నిర్ధారణకు సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి శ్రీనివాస్‌గౌడ్ రుణమాఫీ కాని రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అందరికీ వర్తింపచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు ప్రభావతి, నిఖిత, భూదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

మండల ప్రత్యేకాధికారి పద్మజా రమణి



మాట్లాడుతున్న పద్మజా రమణి

యాచారం: ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వహించొద్దని ప్రత్యేకాధికారి పద్మజారమణి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న దృష్ట్యా ప్రజలు అంటు వ్యాధులకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి ఆరోగ్య నివేదిక రూపొందించాలని తెలిపారు. తాగునీటి సరఫరా విషయంలో లీకేజీలు లేకుండా, కలుషిత నీరు సరఫరా కాకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. డ్రైనేజీ కాల్వలు నిండిపోయి దుర్వాసన, దోమల బెడద లేకుండా శుభ్రం చేయించాలని, నీటి ట్యాంకులను శుభ్రం చేసి, పైకప్పులు బిగించాలన్నారు. వర్షాలు కురుస్తున్న సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని వేగంగా నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, వివిధ గ్రామాల ప్రత్యేకాధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది

మాజీ ఎంపీటీసీ చెరుకూరి మంగ రవీందర్



పోల్కంపల్లి పాఠశాలలో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు సత్కారం

ఇబ్రహీంపట్నం రూరల్: ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని పోల్కంపల్లి మాజీ ఎంపీటీసీ చెరుకూరి మంగ రవీందర్ పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం మండలంలోని పోల్కంపల్లి ప్రాథమిక పాఠశాలలో 12 సంవత్సరాల పాటు విధులు నిర్వహించిన ప్రధానోపాధ్యాయుడు బి. నర్సింహారావు, పి. కృష్ణ, ఎల్. కిరణ్‌కుమార్, శశికళలు జులైలో బదిలీ అయ్యారు. వారికి వీడ్కోలు సమావేశం, నూతనంగా పాఠశాలకు విచ్చేసిన ప్రధానోపాధ్యాయుడు రవికుమార్, విష్ణువర్ధన్, చంద్రశేఖర్, మురారిలకు స్వాగత సన్మానం చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన చెరుకూరి మంగ రవీందర్ మాట్లాడారు. సమాజంలో ఉపాధ్యాయుల సేవలు గొప్పవన్నారు. విధినిర్వహణలో బదిలీలు సహజమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎన్ఓ శ్రీనివాస్, జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు విజయభాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, దత్తాత్రేయ విద్యార్థులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీలో ప్రాధాన్యమివ్వండి



ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతి పత్రం ఇస్తున్న శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

యాచారం: ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని ఏర్పాటు చేసి వైస్ చైర్మన్ పదవీని యాచారం మండలానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ రామకృష్ణ యాదవ్‌కు ఇవ్వాలని బుధవారం మండల కాంగ్రెస్ శ్రేణులు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఇబ్రహీంపట్నంలోని క్యాంపు కార్యాలయంలో మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి తదితర కాంగ్రెస్ బృందం ఎమ్మెల్యేను కలిసి వ్యవసాయ మార్కెట్ కమిటీని త్వరగా ఏర్పాటు చేయాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఆయన త్వరలో పార్టీ శ్రేణులతో సమావేశమై మార్కెట్ కమిటీకి నూతన పాలకవర్గాన్ని ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. యాచారం మండలానికి ప్రాధాన్యత కల్పిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గురునాథ్‌రెడ్డి, లక్ష్మీపతిగౌడ్, లక్ష్మారెడ్డి, శేఖర్‌గౌడ్, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయండి

మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ వెంకటేశ్



మాట్లాడుతున్న వెంకటేశ్

తలకొండపల్లి: ఉపాధ్యాయ ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తలకొండపల్లితో పాటు, ఆమనగల్లు, మాడ్గుల, కడ్తాల్ మండలాల్లో సుమారుగా 172 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మధ్య ఉపాధ్యాయ బదిలీలు నిర్వహించినాపూర్తి స్థాయిలో భర్తీకాలేదన్నారు. కొందరు డిప్యూటేషన్ పేరిట బదిలీపై హైదరాబాద్‌లోని పాఠశాలల్లో పని చేస్తున్నా రని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పని చేసేది హైదరాబాద్‌లో ప్రతీ నెల జీతం తీసుకునేది ఈ మండలాల నుంచేనని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్, అభివృద్ధి, పాఠశాలలపైనే ఆధారపడి ఉందని పేర్కొన్నారు.పాఠశాలలో సరిపడే ఉపాధ్యాయులు లేకుంటే విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారనుందని చెప్పా రు. ఈ విషయంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తక్షణమే స్పందించి ప్రభుత్వం నియామకాలు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్ రెవెన్యూ మండల పరిధిలోని పెద్దఅంబర్‌పేట, తుర్కయాంజాల్ మున్సిపాలిటీలతో పాటు అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని లబ్ధిదారులకు గురువారం కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేయనున్నటు తహసీల్దార్ సురేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటలకు మండల కేంద్రంలోని శివాగార్డెన్స్‌లో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హాజరు కానున్నారని, మున్సిపల్ చైర్మన్లు, వైస్‌చైర్మన్లు, కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యం

కృషి విజ్ఞాన్ శాస్త్రవేత్త శ్రీ కృష్ణ

మంచాల: రైతులు ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కృషి విజ్ఞాన్ శాస్త్రవేత్త శ్రీ కృష్ణ పేర్కొన్నారు. బుధవారం మంచాల మండలంలోని చిత్తాపూర్ గ్రామంలో కృషి విజ్ఞాన్ కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో వస్తున్న సవాళ్లను ఎదుర్కొంటూ ప్రకృతి వ్యవసాయం చేయాలన్నారు. అప్పడే వాతావరణం దెబ్బతినకుండా ఉంటుందన్నారు. కల్తీ లేని పంటలు పండించొచ్చన్నారు. సహజ వనరులను ఉపయోగింగి సమీకృత వ్యవసాయం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు సుధీర్, కిషన్‌రావు, ఉద్యాన శాఖ అధికారి నవీన, మంచాల ఏఈఓ సాయి సిరి, వాటర్ సంస్థ ప్రతినిధి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



చిత్తాపూర్ గ్రామంలో రైతు అవగాహన సదస్సులో మాట్లాడుతున్న శ్రీ కృష్ణ